# కానరాని పచ్చదనం




పెంజర్ల పల్లెప్రకృతివనంలో నీరు పట్టక ఎండిపోయిన చెట్లు

### మోడువారుతున్న పల్లెప్రకృతి వనాలు
### సంరక్షణ కరువై ఎండిపోతున్న మొక్కలు

**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఉన్నత ఆశయంతో ప్రతి గ్రామం హరితమయం కావాలన్న సంకల్పంతో నెలకొల్పిన హరితహారం కార్యక్రమం ద్వారా గత ప్రభుత్వ హయాంలో గ్రామగ్రామాన లక్షలాది మొక్కలు నాటి పల్లెలకు పచ్చనిశోభను తీసుకువచ్చారు. కేసీఆర్ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది నాటిన మొక్కలకు ఎప్పటికప్పుడు సక్రమంగా నీటిని అందించటం, చెట్ల పాదుల వద్ద చెత్తాచెదారం తొలగించటం వంటి కార్యక్రమాలు చేపట్టి మొక్కలను సంరక్షించి వాటిని ఏపుగా పెంచి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా కాపాడారు. మండుటెండలోనూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని పంచిన హరితహారం చెట్లు.. నేడు కాంగ్రెస్ సర్కార్ మొక్కల సంరక్షణపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అన్ని గ్రామాల్లో ఎండిపోయి ఆహ్లాదం కనుమరుగవుతున్నది.**

షాద్‌నగర్‌రూరల్, మార్చి 22 : పచ్చదనం ఉంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, దీంతో పాడిపరిశ్రమలో ఎంతో అభివృద్ధి సాధించవచ్చని, కాలుష్యరహిత సమాజాన్ని నెలకొల్పవచ్చని గత బీఆర్ఎస్ సర్కార్ గ్రామాల్లో హరితహారం కార్యక్రమంతో పాటు, పల్లెప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా పచ్చదనం కోసం పెద్దమొత్తంలో నిధులను సైతం కేటాయించింది. దీంతో పల్లెప్రకృతి వనాలను సంరక్షించేందుకు ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పాటు, పంచాయతీ నిధులు వెచ్చించేలా వెసులబాటు కల్పించింది. ఏ గ్రామంలో చూసినా పల్లెప్రకృతి వనాలు పచ్చదనంతో కళకళలాడుతుండేవి.



ఎండిపోయిన మొక్కలతో హాజిపల్లి పల్లెప్రకృతి వనం

**పల్లెప్రకృతి వనాల్లో** పూలు, పండ్ల మొక్కలతో పాటు వివిధ ఔషధాలు కలిగిన మొక్కలను పెంచేవారు. అనునిత్యం వాటికి నీరును అందించి మొక్కల మధ్యలో కలుపును తీయించేవారు. కంటికి రెప్పలా ప్రతి మొక్కనూ కాపాడేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పచ్చదనం కనుమరుగువుతున్నది.

**47 పంచాయతీల్లో**

ఫరూఖ్‌నగర్ మండలంలోని 47 గ్రామపంచాయతీల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పచ్చదనాన్ని నెలకొల్పేందుకు పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ నేడు కాంగ్రెస్ సర్కార్ వచ్చాక పచ్చదనం కనుమరుగువుతుంది. గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో పల్లెప్రకృతి వనాలు ఎడారిని తలపిస్తున్నాయి. ఇప్పటికైనా సర్కార్ గ్రామాల అభివృద్ధితో పాటు, పచ్చదనంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**కుంటుబడిన అభివృద్ధి**



గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మా గ్రామం ఎంతో అభివృద్ధిని సాధించింది. గ్రామాభివృద్ధికి గత ప్రభుత్వం ప్రత్యేక నిధులను సైతం కేటాయించింది. నిధులతో మా గ్రామంలోని పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలను కంటికి రెప్పలా కాపాడేవారు. నేడు నీరు లేక, మొక్కలను సంరంక్షించేవారు లేక మొక్కలన్నీ ఎండిపోయాయి.

**-మచ్చేందర్,గ్రామస్తుడు,హాజిపల్లి.**



యాచారం మండలం మేడిపల్లి-నానక్‌నగర్ రోడ్డులో ఎండిపోయిన మొక్కలు

## సపోర్టు కర్రలే మిగిలాయి..

యాచారం, మార్చి22: మండలంలో 2024కు గాను ఈజీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర సర్కార్ 75000 హరితహారం మొక్కలు నాటించింది. వాటిలో దాదాపు నీళ్లు లేక అధిక శాతం మొక్కలు ఎండిపోయాయి. మేడిపల్లి-నానక్‌నగర్ రోడ్డుకు ఇరువైపులా టీఎస్ఐఐసీ సహకారంతో సుమారుగా 1000కి పైగా మొక్కలు నాటారు. అందులో కనీసం 300 మొక్కలు కూడా పచ్చగా లేకపోవడం గమనార్హం. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మొక్కలన్నీ ఎండిపోయాయి. కొన్ని చోట్ల మొక్కలు ఎండిపోయి కేవలం సపోర్టు కర్రలు మాత్రమే మిగిలాయి. మరికొన్ని చోట్ల మొక్కల ఆనవాళ్లు కూడా లేకుండా కేవలం గుంతలు మాత్రమే దర్శనమిస్తున్నవి. మాజీ సీఎం కేసీఆర్ పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరనాన్ని పరిరక్షించేందుకు హరితహారం, పల్లె ప్రకృతివనాలు, బృహత్ ప్రకృతి వనాల పేరుతో అడుగడుగునా మొక్కలు నాటించారు. పదేండ్లు పచ్చదనంతో వికసించిన రాష్ట్రం నేడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ఎండిపోవడంతో హరితహారంపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో ఇట్టే అర్థమవుతున్నది.

## నీరుపోయరు.. సంరక్షణలేదు..

మంచాల, మార్చి 22: మంచాల మండలం వివిధ గ్రామాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కింద రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కన్పించేవి. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి మొక్కల సంరక్షణ పట్ల అధికారుల నిర్లక్ష్యం మూలంగా మొక్కలకు నీళ్లు పోసేవారులేక అవి ఎండిపోయి కళాహీనంగా తయారయ్యాయి.



జాపాల-అస్మత్‌పూర్ ప్రధాన రహదారి వెంట ఎండిపోయిన మొక్కలు

## ఎండిపోయిన పెంజర్ల పల్లెప్రకృతివనం

కొత్తూరు, మార్చి 22 : కొత్తూరు మండలంలోని పెంజర్ల పల్లెప్రకృతి వనం ఆలనా పాలనా చూసే వారు లేక ఎండిపోయింది. అక్కడ చెట్లకు నీరు పోసేందుకు బోరు మోటర్ ఉన్నా నీరు పెట్టే నాథుడే కరువయ్యాడు. గతమెంతో ఘనకీర్తిలా వెలిగిన పెంజర్ల ప్రకృతివనం నేడు పట్టించుకునేవారు లేకపోండంతో చెట్లు ఎండిపోయి కళావిహీనంగా తయారయింది. ఇందులో ఏపుగా పెరిగిన మొక్కలతో ప్రకృతివనం మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. కానీ నేడు అవి ఎండుపోయి వెలవెలపోతుంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని గౌస్‌ను ప్రశ్నించగా, తాను ఈ మధ్యనే బదిలీపై వచ్చానని బదులిచ్చాడు. వీలైనంత త్వరలో ప్రల్లెప్రకృతి వనాన్ని సందర్శించి మొక్కలకు నీరు అందేలా చర్యలు తీసుకుంటానని వివరించారు.



వృథాగా పడిఉన్న బోర్ మోటర్

## ఎండుటాకులా దర్శనమిస్తున్న మొక్కలు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్, దండుమైలారం, ముకునూరు, నెర్రపల్లి, నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో మండుటెండలోనూ హరితహారం మొక్కలు పచ్చని వాతావరణం తలపించే విధంగా దర్శనమిచ్చాయి. కాని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలనలో మొక్కలను రక్షించే నాధుడే కరువయ్యాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.





గతంలో నాటిన మొక్కలను పట్టించుకోకపోవడంతో ఎండిపోయి కళాహీనంగా మారిన మొక్కలు

## ట్రీగార్డుల్లో మొక్కల్లేవు..

పెద్దఅంబర్‌పేట, మార్చి 22: మున్సిపాలిటీ పరిధి గౌరెల్లిలో గత ఏడాది వెయ్యికిపైగా మొక్కలు నాటారు. కానీ, వాటిలో కనీసం పది శాతం మొక్కలు కూడా పెరగలేదు. వారానికోసారి కూడా నీళ్లు పోసేవారు కరువయ్యారు. కొన్నిచోట్ల పశువుల నుంచి సరంక్షణ కోసం ఏర్పాటుచేసిన ట్రీ గార్డులు మాత్రమే కనిపించాయి. ఆయా ట్రీ గార్డుల్లో మొక్కలే లేవు.



గౌరెల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రహదారిపై ఎండిన మొక్కలు



కవాడిపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన చెట్లు

## సగం ఎండిపోయాయి..

మండలంలో 2023-24గాను సుమారు 60వేలు, 2024-25లో 42,886 హరితహారం మొక్కలు నాటినట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. అందులో సగానికి పైగా ఎండిపోయాయి. కొన్ని చోట్ల చెట్లను నరికివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలకు నీళ్లు పోసి సంరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**- అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 22**



లష్కర్‌గూడలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేసిన దృశ్యం



అబ్దుల్లాపూర్‌మెట్ పల్లె ప్రకృతి వనంలో చెట్లు చనిపోయి దర్శనమిస్తున్న గుంతలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

షాబాద్, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంకెపల్లిగూడ పంచాయతీ అనుబంధ గ్రామమైన శేరిగూడకు చెందిన చీమల బాల్‌రాజ్, హరిబాబు ఇద్దరు కలిసి మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నాగరగూడకు వెళ్తున్నారు. మల్లారెడ్డిగూడ గ్రామ సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడు బాల్‌రాజ్, హరిబాబు వెళ్తున్న బైకును బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే చీమల బాల్‌రాజ్(47)మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హరిబాబు(45)ను నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతికి కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబ సభ్యులు తెలిపారు. శేరిగూడ గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌కు భార్య హంసమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. హరిబాబు 25 ఏళ్ల క్రితం ఒంగోలు జిల్లా టంగటూర్ గ్రామం నుంచి షాబాద్‌కు బతుకుదెరువు కోసం వలసవచ్చాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**రోడ్డుపై బైఠాయించిన నాయకులు**

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ మాజీ సర్పంచులు చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి మానెయ్య తదితరులు డిమాండ్ చేశారు. మల్లారెడ్డిగూడ గ్రామ సమీపంలో ఆర్ అండ్‌బీ అధికారుల అనుమతి లేకుండానే పాలకేంద్రం నిర్వాహకులు రోడ్డుపై డివైడర్‌ను తొలగించడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. వెంటనే పాలకేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేశ్‌లు ఆందోళన చేస్తున్న నాయకులను సముదాయించి ధర్నా విరమింపజేశారు.

## 28న తైబజార్ వేలం

చేవెళ్లటౌన్, మార్చి 22: చేవెళ్ల మున్సిపాల్ కేంద్రంలోని తైబజార్‌ను ఈ నెల 28వ తేదీన వేలం పాటు నిర్వహించనున్నట్లు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పురపాలక సంఘం కార్యాలయంలో ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనేవారు రూ.25వేలతో మున్సిపాలిటీ పేరిట ఏదైన బ్యాంకులో డీడీ తీసి ఈ నెల 27వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

షాబాద్, మార్చి 22: పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో తెలంగాణ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు అందించాలని, జీతాల పెంపుపై ఈ నెల 25న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని, పర్మినెంట్ చేసి ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ షాబాద్ మండల కన్వీనర్ అర్జున్, ఉపాధ్యక్షుడు రవి, సురేశ్, చంద్రయ్య, రాములు, సాయిలు, యాదమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, మార్చి 22: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. బకాయిలో ఉన్న బిల్లులు రాక ఓ పక్క మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, మరో పక్క ప్రపంచ అందాల పోటీలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ సర్పంచ్‌లకు బిల్లులు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ... అధికారంలోకి రాగానే హామీని విస్మరించి కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, సులోచన సాయిలు, నాయకులు వీరయ్య, రామకృష్ణ, నర్సింహ, లాయక్‌అలీ, మహేశ్, రవి, నాగార్జున, కుమార్‌గౌడ్, సురేశ్, అంజి, రాజు, జంగయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### కాల్వ కబ్జాదారులపై
## చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో నాగులమ్మ చెరువు నుంచి కథాన్ చెరువు, బురుకుంట వరకు వెళ్లే కాల్వను అక్రమంగా కబ్జాచేసి వెంచర్ చేస్తున్న యాజమాన్యంపై ల్యాండ్ గ్రామింగ్ కేసులు పెట్టి శిక్షించాలని తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, జిల్లా అధ్యక్షుడు శంకర్ అన్నారు. బురుకుంట కాల్వ, కథాన్‌చెరువును శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. కథాన్ చెరువు కట్టను కొంతమంది అక్రమంగా కబ్జాచేసి ప్రీ కాస్ట్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ అధికారులు వెంటనే వాటిని తొలగించాలని, చెరువు కట్టను యథావిధిగా చేయాలన్నారు. కట్టను తెంచిన వారిపై ల్యాండ్ గ్రామింగ్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యాకారుల సంఘం నాయకులు యాదయ్య, లక్ష్మయ్య, శంకరయ్య, పర్వతాలు, రాములు, రవి, తదితరులున్నారు.

## నీటి సమస్య లేకుండా చూస్తాం

కొత్తూరు, మార్చి 22: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ మూడో వార్డులో బోర్ మోటర్‌ను వార్డు కౌన్సిలర్ కొస్గి శ్రీనివాసులుతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తాగునిటి ఎద్దడికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు చంద్రకళ, సోమ్లా నాయక్, నాయకులు యాద్యయ్య, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.



## పరీక్షా కేంద్రాల తనిఖీ

కేశంపేట, మార్చి 22: కేశంపేట మండలంలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ మీర్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేశంపేటలోని జెడ్పీహెచ్ఎస్, వశిష్ఠ, కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో జరిగిన హిందీ పరీక్ష తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని 16పాఠశాలలకు చెందిన 548మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు.

### మోకిలా సీఐ
## వీరబాబుకు రివార్డు

చేవెళ్ల రూరల్, మార్చి 22 : శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిలా సీఐ వీరబాబుకు రివార్డు వరించింది. మోకిల స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసును సమర్థంగా ఛేదించి నిందితుడికి జీవితఖైదు పడేలా చేశారు. ఈ కేసులో కీలకపాత్ర పోషించిన వీరబాబు సేవలను గుర్తించిన సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం ఆయనను సత్కరించి రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ రివార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

### ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా
## చేయించుకోవాలి

కేశంపేట, మార్చి 22: ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా చేయించుకోవాలని సంతాపూర్ గ్రామ నాయకుడు నరేందర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో పోస్టాఫీస్ ఉద్యోగుల సహకారంతో శనివారం ప్రమాద బీమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ కారణంచేతైనా మరణిస్తే బీమాతో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. రూ.500 చెల్లించి రూ.10లక్షల ప్రమాద బీమాను పొందాలని కోరారు. అనంతరం పలువురికి పాలసీ రశీదును అందజేశారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది నందిని, బాలరాజు, శ్రీకాంత్, రమేశ్, మహేశ్, రాజు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటిని
## వృథా చేయొద్దు

మొయినాబాద్, మార్చి22: మంచినీటిని పొదుపుగా వినియోగించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, ఎంపీడీవో సంధ్య అన్నారు. వాటర్ ఎయిడ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. అవగాహన సదస్సులో అన్ని శాఖల అధికారులు పాల్గొనగా, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలంలో మంచినీటి వినియోగంపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈఈ ఇమ్రాన్‌అహ్మద్, ఎంఈవో వెంకటయ్య, డీఈఈ హారిక పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సంధ్య